www.kalamjyothi.com

# కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

బుధవారం
11.11.2026




## విద్యాలయంలో విద్యార్థుల గోస..

### ట్రిపుల్ ఐటీలో దయనీయ స్థితి..

- పురుగులన్నం.. మురుగు నీరు
- నరకం చూస్తున్న విద్యార్థినులు
- రోగాల బారిన పడుతున్నా పట్టించుకోరా?
- పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు కలుషిత నీటి నమూనాలు
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్న తల్లిదండ్రులు
- కలెక్టర్ చొరవతీసుకున్న మారని పరిస్థితి

3 లో

బాసర ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో విద్యార్థుల ప్రాథమిక అవసరాలు తీరక అల్లాడుతున్న వైనం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నాణ్యమైన విద్యాబోధన, మెరుగైన వసతులు కల్పిస్తామని పాలకులు హామీలు ఇస్తున్నా, కనీసం తాగేందుకు స్వచ్ఛమైన నీరు, తినేందుకు పరిశుభ్రమైన ఆహారం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. హాస్టళ్లలోని కుళాయిల నుంచి డ్రైనేజీని తలపించేలా మురుగు నీరు సరఫరా అవుతుండటం, మెస్‌లలో భోజనంలో పురుగులు వస్తుండటంతో వేలాది మంది విద్యార్థులు రోగాల బారిన పడుతూ నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారుల అలసత్వంతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ దారుణ పరిస్థితులపై బాధితులు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలంజ్యోతి, నిర్మల్




## ప్రభుత్వ ప్రతిష్ట డీఎస్పీల చేతుల్లోనే..



రాష్ట్ర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రభుత్వ ప్రతిష్ట పెరగాలన్నా, తగ్గాలన్నా అది క్షేత్రస్థాయిలో పనిచేసే డీఎస్పీల చేతుల్లోనే ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రొబేషనరీ డీఎస్పీల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, పోలీసు అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా ప్రజల విశ్వాసాన్ని కాపాడాలని హెచ్చరించారు. బాధితుల సమస్యలను ఒక డాక్టర్‌లాగా ఓపికగా విని న్యాయం చేయాలని, మాదకద్రవ్యాల కట్టడికి ప్రభుత్వం 'ఈగల్ ఫోర్స్'ను రంగంలోకి దించిందని స్పష్టం చేస్తూ నూతన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కలంజ్యోతి, హైదరాబాద్

- విధులు నిర్భయంగా, బాధ్యతాయుతంగా నిర్వహించండి
- అధికారాన్ని దుర్వినియోగం చేస్తే ఉనికి లేకుండా పోతుంది
- డాక్టర్‌లాగా బాధితుల సమస్యను ఓపికగా వినండి
- డ్రగ్స్ నియంత్రణకు కఠినంగా 'ఈగల్ ఫోర్స్'
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## తెలుగు రాష్ట్రాలపై కేఆర్ఎంబీ కొరడా




4 లో

కృష్ణా జలాల వివాదంలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంటూ తెలుగు రాష్ట్రాలకు గట్టి షాక్ ఇచ్చింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి తొలుత ఆమోదించిన అసలు స్వరూపం, ఆ తర్వాత చేపట్టిన మార్పులు, అదనంగా నిర్మించిన కొత్త పథకాల పూర్తి వివరాలను సమర్పించాలంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖల ఈఎన్సీలకు అధికారికంగా లేఖ రాసింది. అనుమతి లేని నిర్మాణాలు, అదనపు నీటి వినియోగంపై సమగ్ర సమీక్ష నిర్వహించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేస్తూ బోర్డు పంపిన ఆదేశాలు రెండు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం రేపుతున్నాయి.

- కలంజ్యోతి, హైదరాబాద్

- అనుమతుల్లేని ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష
- ప్రాజెక్టుల అసలు రికార్డులివ్వండి: కేఆర్ఎంబీ ఆదేశం
- మార్పులు, అదనపు పథకాలపై వివరాలు తప్పనిసరి
- కేడబ్ల్యూడీటీ-1 కేటాయింపులే ప్రామాణికం: బోర్డు లేఖ
- ప్రాజెక్టుల అసలు వివరాలు సమర్పించాలని ఆదేశం

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
బుధవారం 11.11.2026
www.kalamjyothi.com

# ప్రభుత్వ ప్రతిష్ట డీఎస్పీల చేతుల్లోనే..



**కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 10) :** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట పెరగాలన్నా, తగ్గాలన్నా క్షేత్రస్థాయిలో పనిచేసే డీఎస్పీల చేతుల్లోనే ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రొబేషనరీ డీఎస్పీల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, నూతన అధికారులకు దిశానిర్దేశం చేస్తూ కీలక సూచనలు, హెచ్చరికలు చేశారు. పోలీసు శాఖలోకి ఏ ఆశయంతో అడుగుపెట్టారో ఆ లక్ష్యాన్ని ఎప్పటికీ మరవకూడదని, నిబద్ధతతో పనిచేస్తే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. సీనియర్ అధికారులు ప్రజలతో నేరుగా మమేకమయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని, క్షేత్రస్థాయిలో డీఎస్పీలు తీసుకునే నిర్ణయాలే అత్యంత కీలకమని పేర్కొన్నారు. తాము ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి ఓట్లు వేయమని ఎన్నడూ అడగబోమని, విధులను నిర్భయంగా, పూర్తి బాధ్యతాయుతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పదిమంది డీఎస్పీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వ ప్రతిష్ట మసకబారుతుందని, అదే క్రమశిక్షణతో పనిచేస్తే ప్రభుత్వంపై ప్రజల్లో గౌరవం పెరుగుతుందని తేల్చిచెప్పారు.

**ప్రజల్లో నమ్మకం పెంచండి..**

సామాన్యుడి నుంచి పెద్దవారి వరకు ఎలాంటి ఆపద వచ్చినా మొదట గుర్తుకొచ్చేది పోలీస్ స్టేషనేనని, అలాంటి వ్యవస్థపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని అధికారులు నిలబెట్టాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఒక వైద్యుడు రోగికి పరీక్షలు చేసి వ్యాధిని సరిగ్గా గుర్తించినట్లే, పోలీసు అధికారులు కూడా తమ వద్దకు వచ్చే బాధితుల సమస్యలను ఎంతో ఓపికగా వినాలని తెలిపారు. అధికారులకు అది సాధారణ విషయంలా అనిపించినా, బాధితుడికి అది జీవిత సమస్య కావచ్చని గుర్తుచేశారు. సమస్యను సరిగ్గా అర్థం చేసుకుంటే పరిష్కారం సులువవుతుందని, అదనంగా ఐదు నిమిషాల సమయం కేటాయించి బాధితుల గోడు వింటే పోలీసు వ్యవస్థపై అపారమైన నమ్మకం పెరుగుతుందన్నారు. నిన్నటి వరకు సామాన్యులుగా ఉన్నవారు నేడు అధికార హోదా పొందారని, ఆ అధికారాన్ని ప్రజల ప్రయోజనాల కోసం వాడితేనే గౌరవం దక్కుతుందని, వ్యక్తిగత స్వార్థానికి వినియోగిస్తే సమాజంలో ఉనికి కోల్పోతారని హెచ్చరించారు.

**డ్రగ్స్, సైబర్ నేరాల సవాల్..**

గతంలో దొంగతనాలు, నాటుసారాయి నియంత్రణ మాత్రమే పోలీసులకు సవాలుగా ఉండేదని, కానీ ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్స్, కొకైన్, ఇతర మాదకద్రవ్యాల మహమ్మారి అతిపెద్ద సవాలుగా మారిందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ బారిన పడి పంజాబ్ రాష్ట్రంలో 60 శాతం మంది యువత నిర్వీర్యమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోనూ ఈ సమస్య విస్తరిస్తుండటంతో తాము అధికారంలోకి రాగానే కఠిన చర్యల కోసం ప్రత్యేకంగా 'ఈగల్ ఫోర్స్' (Eagle Force) ను ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. నగరంలో డ్రగ్స్ వ్యాపారం చేస్తూ పట్టుబడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని, వారిపై ఉక్కుపాదం మోపుతామని తీవ్రంగా హెచ్చరించారు.

**అధికారులకు విదేశాల్లో శిక్షణ..**

బెంగళూరు నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య వల్ల కొత్త కంపెనీలు రాక ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని, హైదరాబాద్‌లో అటువంటి దుస్థితి రాకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీలకు సీఎం ఆదేశించారు. నగరానికి పరిశ్రమలు, పెట్టుబడులు తరలిరావాలంటే మెరుగైన శాంతిభద్రతలతో పాటు సాఫీగా సాగే ట్రాఫిక్ వ్యవస్థ ఎంతో కీలకమని వివరించారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలు జరుగుతున్న వేళ, సైబర్ క్రైమ్, ఫుడ్ సేఫ్టీ వంటి విభాగాల్లో ఆసక్తి గల పోలీసు అధికారులకు విదేశాల్లో సైతం ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఆధునిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేలా రాష్ట్ర పోలీసు శాఖను అన్ని విధాలా ఆధునికీకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# నిర్మల్‌లో ఏసీబీ అధికారుల దాడులు

## భైంసా ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ జాదవ్ సంతోష్ అరెస్ట్



**కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 10) :** నిర్మల్ జిల్లా కేంద్రం లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి భైంసా ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ జాదవ్ సంతోష్‌ను అరెస్టు చేశారు. భైంసాలో ఓ కాంట్రాక్టర్ కు చెందిన రూ.2.60 లక్షల బిల్లు మంజూరు చేసే విషయంలో రూ.50వేలు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నిర్మల్ లోని ఓ హోటల్ వద్ద రూ.50వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం ఇంచార్జ్ కమిషనర్ ను ఏసీబీ అధికారులు ఇంటికి తరలించి విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# కొమురయ్యకి సంతాపం

## నివాళులర్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 10) :** నర్సంపేట పట్టణానికి చెందిన ప్రముఖ కిరాణా వర్తక సంఘ వ్యాపారి, 25వ వార్డు నివాసి కొంతం కొమురయ్య మృతి పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొమురయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను, కుమారుడు, కూతుళ్లను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి ఎర్ర యాకూబ్ రెడ్డి, వార్డు అధ్యక్షుడు మహాదేవుని రాజ్ వీర్, చీకటి చిరంజీవి, చీకటి శివమణి, తదితరులు పాల్గొన్నారు.

# మేగ్యనాయక్ తండా రోడ్డు కష్టాలు

## మట్టి రోడ్డుపైనే నిత్య నరకం..

- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న గ్రామస్తులు
- అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం
- స్పందించి తక్షణమే రోడ్డు నిర్మించాలని డిమాండ్





**కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 10) :** చెన్నారావుపేట మండలం లింగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మేగ్య నాయక్ తండా ప్రజల రహదారి కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడుస్తున్నా తమ తండాకు కనీస రహదారి సౌకర్యం కల్పించకపోవడం పట్ల గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి మట్టి రోడ్డుపైనే ప్రయాణాలు సాగిస్తూ నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ తండాకు పక్కా రోడ్డు నిర్మించాలని కోరుతూ ఎన్నో సంవత్సరాలుగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా సమస్యకు పరిష్కారం లభించడం లేదని తండావాసులు వాపోతున్నారు. తమ గోడును వినే నాథుడే కరువయ్యాడని కన్నీటిపర్యంతమవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ మట్టి రోడ్డు బురదమయంగా మారి, రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయని వాపోతున్నారు.

**అత్యవసర వేళల్లో అగచాట్లు..**

సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అనారోగ్యానికి గురైన వారిని అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు తరలించాలన్నా, గర్భిణులు, వృద్ధులు ప్రయాణించాలన్నా నరకయాతన అనుభవించాల్సి వస్తోందని తండా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు, అంబులెన్సులు సైతం తండాలోకి రావడానికి నిరాకరిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే కూలీలు, పంట ఉత్పత్తులను తరలించే రైతులు రాకపోకల్లో తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి గురించి పాలకులు ఎన్నో గొప్పలు చెబుతున్నా, తమ తండాకు మాత్రం కనీస రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నిధులు మంజూరు చేయాలి..**

మేగ్య నాయక్ తండా ప్రజలు పడుతున్న రహదారి కష్టాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా గుర్తించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కేవలం కాగితాలపై హామీలు ఇవ్వడం కాకుండా స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్డు దుస్థితిని పరిశీలించాలని కోరుతున్నారు. ఇంకెన్నాళ్లు తాము ఈ అవస్థలు పడాలని, అధికారుల నిర్లక్ష్యానికి తండావాసులు బలి కావాలా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక నిధులు మంజూరు చేసి, రాకపోకలకు వీలుగా మట్టి రోడ్డు స్థానంలో బీటీ లేదా సీసీ రహదారిని నిర్మించి తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



# ఏఎంసీ డైరెక్టర్ ఇమాంబాయికి సన్మానం

## ఘనంగా సత్కరించిన కాంగ్రెస్ శ్రేణులు

**కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (నవంబర్ 10) :** ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన బోప్పాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమాంబాయిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆయన నివాసంలో కలిసిన నాయకులు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చెన్ని బాబు, సీనియర్ నాయకులు బండారి బాల్ రెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫీక్, నాయకులు కస్తూరి ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

# కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

బుధవారం 11.11.2026

www.kalamjyothi.com


# విద్యాపీఠంలో విద్యార్థుల గోస..



## భూవివాదంపై ఫిర్యాదుతో కేసు నమోదు

**దమ్మన్నపేటలో ఘటన**

**స్థలాన్ని పరిశీలించిన నాగేంద్రచారి**

**కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (నవంబర్ 10) :** గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి మంగళవారం సాయంత్రం సమగ్ర విచారణ జరిపారు. గ్రామానికి చెందిన అవునూరి సంధ్య (ఎస్సీ మాదిగ) స్థానికంగా ఉన్న 1.20 గుంటల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ భూమి తమదేనంటూ ఇదే గ్రామానికి చెందిన ముదిరాజ్ కులానికి చెందిన జనగామ సుశీల, ఆమె భర్త జనగామ చిరంజీవి, వారికి మద్దతుగా మహేష్, సుశీల, మంగళి బాలరాజు కలిసి ఫిర్యాదురాలి ఇంటికి వచ్చారు. సంధ్యతో పాటు ఆమె భర్తను కులం పేరుతో బూతులు తిడుతూ దూషించడమే కాకుండా, వారి కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించారు. ఈ దౌర్జన్యంపై బాధితులు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై బాలరాజు కేసు నమోదు చేశారు. ఈ మేరకు డీఎస్పీ నాగేంద్రచారి స్వయంగా సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

**కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 10) :** రాష్ట్రంలో అత్యున్నత సాంకేతిక విద్యను అందించే బాసర రాజీవ్‌గాంధీ నాలెడ్జ్ టెక్నాలజీస్ ప్రాంగణంలో కనీస మౌలిక వసతులు లేక వేలాది మంది పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన చదువు, మెరుగైన వసతులు కల్పిస్తామని పాలకులు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. కనీసం తాగేందుకు స్వచ్ఛమైన నీరు, తినేందుకు పరిశుభ్రమైన ఆహారం అందించడంలో పాలకవర్గం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వసతి గృహాల కుళాయిల నుంచి డ్రైనేజీని తలపించేలా మురుగు నీరు సరఫరా అవుతుండటంతో విద్యార్థినుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆ నీటిని వాడటం వల్ల ఒళ్లంతా దద్దుర్లు, తీవ్రమైన చర్మవ్యాధులు, అలర్జీలు వస్తున్నాయని విద్యార్థిను లు కన్నీటిపర్యంతమవుతున్నారు.




**రోగాల బారిన పడుతున్నా పట్టించుకోరా?**

మెస్‌లలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనంలో తరచూ పురుగులు వస్తుండటంతో ఆహార నాణ్యతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వంటశాలల్లో భోజనం తయారీకి సైతం మురుగు నీటినే వినియోగిస్తున్నారంటూ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో పండుతున్న ఆహారాన్ని తినలేక, దుర్వాసన వెదజల్లుతున్న నీటిని తాగలేక వందలాది మంది విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. కలుషిత నీరు, ఆహారంతో కడుపు నొప్పి, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హాస్టల్ గదుల్లోనే నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ దారుణ పరిస్థితులపై పలుమార్లు అధికారులకు, వార్డెన్లకు విన్నవించినా కనీస స్పందన కరువైందని విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కలెక్టర్ చొరవ.. ల్యాబ్‌కు నమూనాలు..**

ప్రాంగణంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చడంతో సమస్యను పరిష్కరించాల్సింది పోయి యాజమాన్యం సెలవులు పొడిగించింది. ఆ తర్వాత ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తామని ప్రకటించి, మళ్లీ హఠాత్తుగా భౌతిక తరగతులకు హాజరుకావాలంటూ విద్యార్థులను పిలిపించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. విద్యార్థుల ఆందోళనలతో కదిలిన జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని, గోదావరి నుంచి నీటిని తరలించేందుకు అవసరమైన మోటార్ల కొనుగోలు నిమిత్తం రూ.8 లక్షలు మంజూరు చేశారు. మరోవైపు అధికారులు కుళాయిల నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు.



**విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి..**

రాష్ట్రంలో పాలకులు మారినా బాసర విద్యార్థుల తలరాతలో ఎలాంటి మార్పు రాలేదని, సమస్యలు మరింత జటిలమై నిత్యం బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విలసిల్లాల్సిన విద్యాసంస్థ కనీస పారిశుధ్యం లోపించి మురికి కూపంలా మారిందని ఆవేదన చెందుతున్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని, నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



## బాధిత కుటుంబానికి సర్పంచ్ పరామర్శ

**కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 10) :** మండల పరిధిలోని అక్కల్ చెడ కట్టాయపల్లికి చెందిన సూర తిరుపతి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ గ్రామానికి చేరుకుని తిరుపతి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చిన్న వయస్సులోనే తిరుపతి మరణించడం ఎంతో బాధాకరమని, ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, ఉపసర్పంచ్ కక్కెర్ల రజిత శ్రీను, నాయకులు బొంత శ్రీను, బోనగిరి సారయ్య, బొంత సురేష్, బొంత కుమార్, బాధావత్ వీరు, ఇస్లావత్ వీరు, లక్క రాజు, భూపాల్, సిద్ధ జనార్దన్, కరెడ్ల శివ, అశోక్, బొంత శ్రీకాంత్, జిడ్డి ప్రవీణ్, శ్రీకాంత్, బాలు, శ్రీను, రాకేష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలకు సాధులనగర్ భక్తుడి పాదయాత్ర

**కలంజ్యోతి, నర్సాపూర్ (నవంబర్ 10) :** మండల పరిధిలోని సాధుల నగర్ గ్రామానికి చెందిన కర్రె మల్లేశం స్వామి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి సన్నిధికి కాలినడక పాదయాత్రగా వెళ్లడం తనకు ఎంతో సంతోషాన్ని, ఆధ్యాత్మిక తృప్తిని కలిగిస్తోందని తెలిపారు. ప్రజలందరినీ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో చల్లగా చూడాలని ఆ మణికంఠ స్వామిని మనసారా వేడుకున్నట్లు చెప్పారు. సాధుల నగర్ నుంచి మొదలైన ఈ పాదయాత్ర కార్యక్రమంలో పలువురు అయ్యప్ప స్వాములు పాల్గొని మల్లేశం స్వామికి వీడ్కోలు పలికారు.





## సత్సంగ సదనంలో జ్ఞానయజ్ఞం

**రేపటి నుంచి శ్రీమద్భాగవత ప్రవచనాలు: లక్ష్మారెడ్డి**

**కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (నవంబర్ 10) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని భక్త సత్సంగ సదనంలో 66వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 12 నుంచి 20 వరకు శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీశ్రీ సరస్వతి గోవింద రాజుల ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భాగవత ప్రవచనాలు, సాయంత్రం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈనెల 13 నుంచి 19 వరకు శృంగేరి శారదా పీఠ అస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి ప్రియ శిష్యులు బ్రహ్మశ్రీ డాక్టర్ గారెపల్లి మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భాగవత సప్తాహం కన్నుల పండువగా సాగుతుందన్నారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ప్రభాతభేరి, గీతా పారాయణం, సూర్య నమస్కారాలు, సాయంత్రం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక బోధనలు ఉంటాయని వివరించారు.



**20న నగర సంకీర్తన..**

ఈనెల 20న శుక్రవారం ఉదయం నగర సంకీర్తన నిర్వహించి, అనంతరం లిఖిత రామకోటి స్తూపం వద్ద భక్తులతో కలిసి బ్రహ్మచారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామ నామస్మరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రఖ్యాత హరికథ భాగవతారిణి పవిలాల నాగరాణిచే శ్రీరామ కళ్యాణం హరికథ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవాల్లో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సత్సంగ సదనం అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస గుప్తా కోరారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
బుధవారం 11.11.2026
www.kalamjyothi.com




# తెలుగు రాష్ట్రాలపై కేఆర్ఎంబీ కొరడా

**కలంజ్యోతి బ్యూరో (నవంబర్ 10) :** కృష్ణా నదీ జలాల వినియోగం, ప్రాజెక్టుల నిర్వహణ వివాదంలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక అడుగు వేసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి తొలుత ఆమోదించిన అసలు సమగ్ర వివరాలను వెంటనే సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఆదేశించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల జలవనరుల శాఖల ఈఎన్సీలకు బోర్డు ప్రత్యేకంగా లేఖ రాసింది. ఉమ్మడి ప్రాజెక్టుల అసలు స్వరూపం, ఆ తర్వాత కాలంలో చేపట్టిన మార్పులు, అదనంగా నిర్మించిన ప్రాజెక్టులు, వాటికి లభించిన సాంకేతిక అనుమతుల వివరాలను ఆధారాలతో సహా నివేదించాలని స్పష్టం చేసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల ఎడమ, కుడి కాలువల ఆఫ్‌టేక్‌లు, వాటి పరిధిలోని ఆయకట్టు, డిజైన్ డ్రాలు, కమాండ్ ఏరియాలు, నీటి కేటాయింపులతో పాటు అసలు అనుమతి ఉత్తర్వులను సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది.

**మార్పులు, అదనపు పథకాలపై ఆధారాలతో నివేదిక ఇవ్వాలి..**

తొలుత ఆమోదించిన సాగునీరు, విద్యుదుత్పత్తి, తాగునీటి అవసరాల్లో కాలక్రమేణా చేసిన మార్పులు, విస్తరణలు, కొత్తగా చేర్చిన పథకాల పూర్తి చిట్టాను అందించాలని కేఆర్ఎంబీ స్పష్టం చేసింది. అనుమతులు లేకుండా చేపట్టిన కొత్త ప్రాజెక్టులు, విస్తరించిన పథకాల డిజైన్లు, వాటి లక్ష్యాలు, అదనపు నీటి అవసరాలతో పాటు వీటికి లభించిన సాంకేతిక అంగీకారాలు, క్లియరెన్సుల పత్రాలను రికార్డులతో సహా అందజేయాలని ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ప్రాజెక్టులు, పెంచిన సామర్థ్యాలపై సమీక్ష నిర్వహించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు బోర్డు వివరించింది. ఈ వివరాలు రెండు రాష్ట్రాల న్యాయపరమైన హక్కులకు, కోర్టులలో పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాలకు ఎలాంటి భంగం కలగకుండా కేవలం అధికారిక రికార్డుల పరిశీలన కోసమేనని స్పష్టం చేసింది.

**కేడబ్ల్యూడీటీ-1 కేటాయింపులే ప్రామాణికం..**

కేంద్ర జలశక్తి శాఖ గతంలో పంపిన మార్గదర్శకాల ప్రకారం కేడబ్ల్యూడీటీ 1 కేటాయింపులు, ప్రారంభంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల స్వరూపమే ప్రామాణికంగా కొనసాగుతోందని కేఆర్ఎంబీ తన లేఖలో పునరుద్ఘాటించింది. ప్రాజెక్టుల పరిధిలో తదనంతరం చోటుచేసుకున్న మార్పులను సరిపోల్చడానికి అసలు రికార్డులు అత్యవసరమని పేర్కొంది. ఇప్పటికే శ్రీశైలం పరిధిలో 11, నాగార్జునసాగర్ పరిధిలో రెండు నాన్‌అప్పర్టినెంట్ కాంపోనెంట్లు ఉన్నట్లు గుర్తించామని, నాగార్జునసాగర్ అంశాలు న్యాయస్థానంలో ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. గతంలో పలుమార్లు లేఖలు రాసినా రెండు రాష్ట్రాల నుంచి ఆశించిన సమాచారం అందలేదని గుర్తుచేస్తూ, ఇకనైనా తక్షణమే పూర్తి వివరాలను పంపాలని కేఆర్ఎంబీ తీవ్రస్థాయిలో ఆదేశించింది.



# ఆరుతడి పంటలే మేలు

- **ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకోవాలి**
- **సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**కలంజ్యోతి, ఇల్లంతకుంట (నవంబర్ 10) :** యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంపై పడే పరిణామాలు, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు ప్రత్యేక అవగాహన కల్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామ రైతు వేదికలో గ్రామ సర్పంచ్ కాత మల్లేశం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు ఉన్నందున, వరి పంటకు బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా విచక్షణారహితంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వినియోగించాలని అధికారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ (డీసీఓ), మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల రెవెన్యూ అధికారి సురేష్, ఎంపీడీఓ శశికళ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అఖిల్, ఇరిగేషన్ ఏఈఈ అనుపమ, విద్యుత్ శాఖ ఏఈ నగేష్, ఏఈఓ అభిషేక్, ఏపీఎం కుమారస్వామి, గ్రామ పాలన అధికారి స్వప్న, తాళ్లపల్లి సర్పంచ్ మీసాల కనుకరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# సుసంపన్నమైన నిర్మల్







## రైతు గర్జనకు భారీ ఏర్పాట్లు..

**కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 10) :** నిర్మల్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న రైతు గర్జన సభ సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రం పూర్తిగా గులాబీమయమైంది. నిర్మల్ లోని అన్ని ప్రధాన కూడళ్ళలో పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం నిర్వహించనున్న రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో నిర్మల్ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల బి ఆర్ ఎస్ నేతలు కూడా నిర్మల్ లో మకాం వేశారు. గత రెండు రోజులుగా దీపావళి సందర్భంగా మందగించిన ఏర్పాట్లు ఊపందుకున్నాయి. నిర్మల్ లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించనున్న రైతు గర్జన సభావేదిక ఏర్పాట్లను మాజీ ఎంపీ బాల్క సుమన్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఎంతో గోస పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎరువులు, కరెంటు సరిగా సరఫరా కాకపోవడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు గర్జన పేరుతో సభలను నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిపించేందుకు ముందుకెళ్తున్నారన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే రైతు గర్జన సభకు పెద్ద సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కాగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు. వారి వెంట బీఆర్ఎస్ నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి రామ్ కిషన్ రెడ్డి, జాన్సన్ నాయక్, నాయకులు నల్ల వినయ్ రెడ్డి, మారుగొండ రాము, తదితరులు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక



# సరైన గుర్తింపు లేదు

గృహిణిగా బాధ్యతలు నిర్వర్తించడం ప్రపంచంలోనే అత్యంత కష్టమైన పనని, కానీ వెలకి తగిన గుర్తింపు, గౌరవం దక్కడం లేదని సినీ నటి జెనీలియా దేశ్‌ముఖ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఓ షోలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. మహిళల్లో వచ్చే మేనోపాజ్ (రుతుక్రమం ఆగిపోవడం), వయసుతో వచ్చే శరీరక మార్పులపై బహిరంగంగా మాట్లాడేందుకు వెనుకాడొద్దని, వయసు పెరగడాన్ని సహజంగా స్వీకరించాలని స్పష్టం చేశారు. సమాజం మహిళలను ఎప్పుడూ గ్లామరస్‌గా కనిపించాలనే ఒత్తిడికి గురిచేస్తుందని, 20 ఏళ్ల వయసు కంటే 40 ఏళ్ల ప్రాయంలోనే తాను మరింత ధైర్యంగా, ప్రశాంతంగా ఉన్నానని తెలిపారు. కెరీర్ ప్రారంభంలో అమీర్ ఖాన్ ప్రోత్సాహంతో సహజ సిద్ధమైన లుక్‌తోనే గుర్తింపు పొందినని ఆమె గుర్తు చేసుకున్నారు.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.